వ్యంగ్య నాటిక

# 'బొమ్మాళీ... నిన్ను వదల!'

- 'చల్ బే, నోర్ముయ్!' - అల

**జై ఆంధ్ర** *(భార్య)* : ఏయ్ అబ్బాయ్! నువ్వు నాకు తాళి కట్టావ్, గుర్తుందా? ఇదేమిటి... నువ్వు... నా వెంటబడాలి గానీ, - 'కలిసుందాం రా...' అంటూ మా చిన్నాన్న పెద్దకూతురు ఆ తెలంగాణా పోరి వెంటబడ్తున్నావ్! నీకేమైనా పిచ్చా-వెర్రా?

**సమైక్యాంధ్ర** *(భర్త)* : అరే, వెర్రిదానా! నీకు నిజంగా బుర్రలేదే! నువ్వు నిశ్చింతగా వుండు! నాకు దాని మీదేమైనా ప్రేమ కారిపోతోందనుకుంటున్నావా? ఏదో కొన్త ప్రేమున్నట్టు హడావిడి చేస్తున్నాను - అంతే! అది వెంటబడ్డంకాదు.... జస్ట్ మస్కా! నువ్వేం బెంబేలు పడకు! ఒట్టు - నేనెప్పటికీ నీవాణ్ణే! ఆ తెలంగాణా పోరి ఉత్త పిచ్చిమాలోకం... అమాయకురాలు! ఇదంతా నిజమేననుకుని... పొంగిపోతుంది! దాని చదువు పూర్తయ్యేదాకా మనింట్లోనే పడుంటుంది- మనకు గొడ్డు చాకిరీ చేస్తుంది! నువ్వు కాల్మీద కాలేసుకొని దర్జాగా బ్రతికేయొచ్చు! ఒకవేళ దానికి రెక్కలొస్తే ఎలా అని చింతించకు - కత్తిరించడానికి నేను రెడీ! అయినా ఇన్నాళ్లూ - మనింట్లో కిక్కురుమనకుండా ఊడిగం చేసిన వ్యక్తి - ఇప్పుడు హఠాత్తుగా మనల్ని కాదని వెళ్ళి పోవడమేమిటి? ఎంత పొగరు? ఛ, డామ్ ఇన్సల్ట్! మనకున్న ధనబలం, కండబలంతో - దీన్నో పట్టుబట్టాలి! ఇది ఇంకెక్కడా బ్రతక్కుండా చూడాలి! మన ధూం ధాం తుఫాను ముందు....... దీని చైతన్యం.......



దూదిపింజలా గాలికెగిరి పోవాలి! చూద్దాం... ఎవరడ్డు వస్తారో!? ఏమంటావ్?

★ ★ ★

**పొరుగు రాష్ట్రం** *(పక్కింటిపిల్ల)* : (మనసులో) వీడి అహంకారం తగలెయ్య! పాపం - ఇప్పుడైనా ఆ పిల్లకి వెట్టిచాకిరీనుండి విముక్తి లభిస్తుందేమోననుకుంటే - వీడికిదేం రోగం? కనీసం... మరదలు కదా అన్న కనికరం కూడా లేదు! ఇన్నాళ్ళూ పీల్చి పిప్పి చేసింది చాలదన్నట్లు... ఆ పిల్లనింకా వదలనంటున్నాడు!

★ ★ ★

**జై ఆంధ్ర** : (భర్తతో) చాల్లే సంబడం! నీ వంకర బుద్ధి నాకు తెలీదా? నీ ఎత్తులూ జిత్తులూ అర్థం చేసుకోలేని వెర్రిదాన్ననుకోకు! పిచ్చి పిచ్చి వేషాలేసావంటే... నేనూర్కోను - ఆఁ !

★ ★ ★

**పొరుగు రాష్ట్రం** *(పక్కింటిపిల్ల)* : (మనసులో) వీడికిదేం జబర్దస్తీ! ఆ పిల్ల ఓవైపు - వీణ్ని ఛీ కొడ్తూంటే - 'నవ్వి పోదురుగాక - నాకేటి సిగ్గ'న్నట్టుగా వుంది వీడి వాలకం! వొద్దు, వదిలెయ్యమంటూంటే.... వీడి మనోభావాలు దెబ్బతింటాయటగానీ - పో, పొమ్మని ఛీత్కరిస్తూంటే, ఆత్మాభిమానం దెబ్బతినదట... వార్నీ, ఇదెక్కడి చోద్యం!?

★ ★ ★

సమైక్యాంధ్ర : (మనసులో) ఛ! నా భార్య! అదేనండీ... 'జై ఆంధ్ర'! ఇదో పతివ్రత! ఇది పడనీయదు గానీ - ఈ తెలంగాణా పోరికో చెల్లి 'హైదరాబాద్' వుంది! దాని సిగదరగ! ఏమందం!? ఎంతందం!? ఒకవేళ ఈ తెలంగాణా పోరి దార్లోకి రాకపోతే - ఆ హైదరాబాద్ పోరికి లైనేస్తే సరి! ఊడిగం చేయడానికి ఎవరైతేనేం? ఇద్దరూ పిరిగ్గొడ్డులే! ఎవరో ఒకరు దారికి రాకపోతారా!?

(పైకి) ఏయ్ ఆంధ్రాపిల్లా - నా ముద్దుల భార్యా! నేనలా కాస్సేపు బయటకి వెళ్లొస్తా! గిట్టని వాళ్లు ఎవరైనా మనింట్లోకి చొరబడగలరు - పదిలం! నువ్వు గట్టిగా తలుపేసుకో!

ఏయ్! హైదరాబాద్ బొమ్మాళీ - నిన్ను వదల! ఇదిగో - నిన్ను వొదల్నుగాక వదల! ఆ తళుకులూ, బెళుకులూ... ఓహ్! నిన్ను చూసి 'ఫిదా' అయ్యా నంటే నమ్ము!

హైదరాబాద్ (భార్య 'చిన్నతండ్రి' చిన్నకూతురు) : వార్నాయనో! ఇన్నాళ్లూ మా అక్క మీద కన్నేసింది చాలక - వీడిప్పుడు నా వెంట బడుతున్నాడు! వీడ్ని చూస్తేనే కంపరం పుడుతోంది, ఇప్పుడు నేనేం చేసేది దేవుడోయ్!?

ప్రత్యేక తెలంగాణా (భార్య 'చిన్నతండ్రి' పెద్దకూతురు) : ఫికరెందుకు చెల్లీ! నువ్వు అసలే కత్తి! పైగా బాగా చదూకున్న దానివి! నీకేం భయం? వాడు ఈసారి ఏ వంకో నీదగ్గరకి వచ్చి, నీ ఒంటి మీద



చెయ్యేసాడనుకో, దిమ్మదిరిగి.. కళ్ళుబైర్లు కమ్మేలా ఈడ్చికొట్టు! అదిగో, ఆ వచ్చేది ఎవరై వుంటుంది!? ఓహో... ఆ పూలరంగడి భార్య... మా పెదనాన్న కూతురు... 'జై ఆంధ్ర' కాబోలు! చేతిలో అప్పడాల కర్రతో - భర్తని వెతుక్కుంటూ ఇటే పరిగెత్తుకొస్తున్నట్టుంది. వాఁ.. క్యా సీన్‌హై!

హైదరాబాద్ : బస్! అబ్ తో బచ్ గయే!

జై ఆంధ్ర : (సమైక్యాంధ్రనుద్దేశించి) ఏయ్ దొంగసచ్చి నోడా! ఎక్కడ దాక్కున్నావురా? నీమీద నీ మరదళ్లు చెప్పులు విసిరేట్టున్నారు! నీ పనవుద్ది! ఎంత కాదనుకున్నా నువ్వు నా భర్తవి! ఎందుకైనా మంచిది... అదిగో, ఆ దొడ్డి దారిన లగెత్తు!

సమైక్యాంధ్ర : చచ్చాంరా దేవుడోయ్! ఇదేమిటి? నా భార్య తన 'ఆత్మాభిమానం' దెబ్బతింటోందని ఏడుస్తోంది! ఛ!, డామిట్... కథ అడ్డం తిరిగింది! నేను రెంటికీ చెందని రేవడినైతా! నాకిక తోక ముడువక తప్పేట్టు లేదు!

హైదరాబాద్ : అమ్మయ్య, పీడా విరగడైందక్కా! వాడు కాలికి బుద్ధి చెప్పాడు!

ప్రత్యేక తెలంగాణా : హిపిప్ హుర్రే! చెల్లీ, దే తాలి!

**అంకితం:**

*నిద్రాణంగా ఉన్న తెలంగాణా ప్రజల పౌరుషాన్ని తన చర్యలతో 'నన్ను మీరేం చేయగలర్లే!' అన్నట్టుగా రెచ్చగొట్టి - ఆ రకంగానైనా వాళ్ళందర్నీ వాళ్ళ హక్కులకై ఏకం చేసిన 'జగడ'పాటికి కృతజ్ఞతలతో!*

2009 'ప్రత్యేక తెలంగాణా' రాష్ట్రోద్యమం సందర్భంగా...
జరుగుతోన్న పరిణామాలపై 'వ్యంగ్య నాటిక'

- అల